# నిద్రావస్థలో నిఘా నేత్రం

- పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలు
- నిరుపయోగంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థ
- పట్టించుకోని పోలీసులు



రైల్వేస్టేషన్ వద్ద అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు



ఉదయగిరి రోడ్డులో నిరుపయోగంగా సీసీ కెమెరాలు



కమాండ్ కంట్రోల్ భవనం

**కావలి:** పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు పనిచేయడం లేదు. వాటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ భవనం సైతం నిరుపయోగంగా మారింది. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు కీలకమైన నేరాల ఛేదనలోనూ సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయి. అటువంటి వాటిని పోలీసులు అటకెక్కించడంపై పట్టణ ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో నెల్లూరు తర్వాత అన్ని రకాలుగా ప్రాముఖ్యత కలిగిన పట్టణం కావలి. నెల్లూరు–ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉండడం.. రాయలసీమ ముఖద్వారంగా ఉండడం..వస్త్ర వ్యాపార రంగంలో మినీముంబయిగా విరాజిల్లుతుండడం.. విద్యారంగంలో విశిష్ట స్థానం సంతరించుకోవడం, తదితర కారణాల రీత్యా కావలి పట్టణం సున్నితమైంది. రాష్ట్రంలోని ఎక్కడెక్కడి వారో పట్టణాన్ని సందర్శిస్తుంటారు. పోలీసుల అంచనా మేరకు పట్టణంలో రోజుకు పది వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల ఛేదనకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గతంలో పోలీసు అధికారులు నిర్ణయించారు. కావలి సరిహద్దు ప్రాంతమైన గౌరవరం నుంచి జిల్లా సరిహద్దు గ్రామమైన రుద్రకోట వరకు వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. తొలుత ప్రయోగాత్మకంగా 14 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని డీఎస్పీ కార్యాలయంతో అనుసంధానించి ఫుటేజీలను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా సీసీ కెమెరాల ఫుటేజీలను 24 గంటల పాటు పర్యవేక్షించడానికి, వీడియోలను భద్రపరచడానికి కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణాన్ని నిర్మించారు. ఆ సమయంలో మరో 36 సీసీ కెమెరాలను అమర్చారు. కమాండ్ కంట్రోల్ భవనంలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో సీసీ కెమెరాల వీడియో ఫుటేజీలను నెల్లూరులోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. ఆ తరువాత మరో 50 సీసీ కెమెరాలను ఏర్పాటే చేసేందుకు పోలీసులు కసరత్తు చేసినప్పటికీ సఫలం కాలేదు.

**పర్యవేక్షణ లోపంతో..**

పట్టణంలోని సీసీ కెమెరాల పర్యవేక్షణను పోలీసులు గాలికొదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. గతంలో కమాండ్ కంట్రోల్ భవనంలో ప్రత్యేకంగా పోలీసు నిపుణులను ఏర్పాటు చేసి 24 గంటలు సీసీ ఫుటేజీని పర్యవేక్షిస్తుండేవారు. నేరాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనదారులను గుర్తించి చలనాలను సైతం పంపేవారు. ఆ తరువాత క్రమంగా వాటిని అటకెక్కించారు. దీంతో పట్టణంలో శాంతిభద్రతలు లోపిస్తున్నాయి. దొంగలు చెలరేగిపోతున్నారు. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీలు, ఇతర నేరాలు జరిగినప్పుడు పోలీసులు ఆ ప్రదేశానికి చుట్టుపక్కల నివాసాలు, వ్యాపార సముదాయాల్లో ఉన్న ప్రైవేట్ సీసీ కెమెరాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సీసీకెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### సీసీ కెమెరాలు పనిచేయక..

ఇటీవల బృందావనం కాలనీలోని ఓ ఇంట్లో భారీ దోపిడీ జరిగింది. ఒకటిన్నర కోటి రూపాయల మేర సొత్తును దొంగలు అపహరించుకెళ్లారు. ఈ కేసు దర్యాప్తు లో దొంగలు ఆనవాళ్లు గుర్తించేందుకు పట్టణంలోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులు అనేక అవస్థలు పడ్డారు.

ఇటీవల ముసునూరులో ఓ గృహిణి ఇంటి సమీపంలోని ఆలయానికి వెళ్లగా దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.5 లక్షల విలువైన బంగారాన్ని అపహరించారు. కేవలం గంట వ్యవధిలోనే దొంగలు చోరీని పూర్తి చేశారు. పట్టణంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పోలీసులు దొంగలను గుర్తించలేకపోయారు.

ఇటీవల పుచ్చలపల్లివారి వీధిలోని ఓ ఇంట్లో దొంగలు పడి రూ. 3.5 లక్షల విలువైన ఆభరణాలు దోచుకెళ్లారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేయలేకపోయారు.

పట్టణంలోని జనతాపేటలోని ఓ ఇంట్లో దొంగలు రూ.2 లక్షల విలువ చేసే బంగారాన్ని అపహరించుకెళ్లారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేయకపోవడంతో పోలీసులు విచారణలో నిస్సహాయతను వ్యక్తం చేశారు.

### వినియోగంలోకి తీసుకురావాలి

పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఇటీవల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసులు స్పందించి శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. –రాము, కావలి

### సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు

పట్టణంలో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తాం.
–ఎం వెంకట రమణ, డీఎస్పీ, కావలి

## క్లుప్తంగా

### ముమ్మరంగా వంతెన నిర్మాణ పనులు



**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరులోని దేవత మహాల్ సెంటర్‌లో వంతెన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఆత్మకూరు రోడ్డుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ సెంటర్ నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. వంతెనతో పాటు డ్రైనేజీ పనులు పూర్తయితే బైపాస్‌కు వేగంగా వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది. ప్రస్తుతం వంతెన పనులు జరుగుతున్నందున బస్సులు, ఇతర భారీ వాహనాలను దారి మళ్లించి బైపాస్ మీదుగా పంపుతున్నా రు. పనులు వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

### పిండినల్లితో తీవ్రనష్టం

**చేజర్ల:** పంటలకు పిండి నల్లి తీవ్రనష్టాన్ని చేకూరుస్తుందని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ తెలిపారు. యనమదలలో సాగుచేసిన పత్తి పంటను గురువారం ఆయన పరిశీలించారు. పత్తి పంటకు పిండి నల్లి ఎక్కువగా ఆశించి ఉండడం గమనించి సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు. పిండి నల్లి నిరంతరం రసం పీల్చడం వల్ల చెట్లు ఎండిపోతాయని తెలిపారు. వాటి నివారణకు ముందుగా పిండినల్లి సోకి ఎండిపోయిన చెట్లను తొలగించి నాశనం చేయాలన్నారు. పురుగుకు ఆతిథ్యం ఇచ్చే వయ్యారిభామ, పాయలాకు, తదితర కలుపు మొక్కలను నాశనం చేయాలని సూచించారు. తొలి దశలో మోనోక్రోటపాస్ మరియు నీటిని 1:4 నిష్పత్తిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ప్రొఫెనోపాస్ 2 మి.లీ., శాండోవిట్ 1 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

### సామూహిక లలితా సహస్రనామ పారాయణం



**సంగం:** స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహిళా భక్తులు సామూహికంగా లలితా సహస్ర నామ పారాయణం చేశారు. ప్రపంచ శాంతి, వర్షాలు పుష్కలంగా కురిసి పాడి పంటలతో లోకం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ లలితా సహస్రనామ పారాయణం చేసినట్లు వారు తెలిపారు.

### ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

**పరికుంటపాడు:** గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా క్షేత్ర సహాయకులు, మేట్లు చూడాలని ఎంపీడీఓ మల్లికార్జున సూచించారు. మండలంలోని జీ కొండారెడ్డిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు.

**ఉదయగిరి:** ఉదయగిరి పంచాయతీ పరిధిలోని డిగ్రీ కళాశాల సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ పరిశీలించారు. జాబ్‌కార్డులు పరిశీలించారు. ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పనులకు హాజరుకారాదన్నారు. కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందాలని కూలీలకు సూచించారు.

**అనుమసముద్రంపేట:** మండలంలోని అక్బరాబాద్‌లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పశువుల నీటి కుంట పనులను ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి కూలీలకు సూచనలు చేశారు.

### యువతిపై వేధింపులు

కావలి: పట్టణంలోని క్రిస్టియన్‌పేట ఆరోలైన్‌లో నివాసం ఉంటున్న ఓ యువతిని జక్కంపూడి సుబ్బానాయుడు అలియాస్ చింటూ వేధిస్తున్నట్లు ఆ యువతి తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ కుమార్తె కళాశాలకు వెళ్తున్నప్పుడు స్కూటీని అడ్డగించి ఫొటోలు, వీడియోలు అందరికీ చూపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

### పొలాల్లో మతిస్థిమితం లేని వ్యక్తి

**సంగం :** మండలంలోని జంగాలదొరువు గ్రామ సమీపంలోని ఓ తోటలో మతిస్థిమితం లేని వ్యక్తి ఐదు రోజులుగా పడి ఉండడాన్ని సదరు తోట యజమాని గురువారం గుర్తించారు. చేతులు గొలుసులతో కట్టేసి ఉండడంతో సమీపంలోని ఏఎస్‌పేట దర్గా ప్రాంతం నుంచి తప్పించుకుని వచ్చి ఉంటాడని భావించి పోలీసులకు సమాచారం అందజేశారు. అతన్ని నంద్యాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయగా వారు వచ్చి తీసుకెళ్లారు.

### ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం

**సంగం:** మండలంలోని పెరమన వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారి పక్కన బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్‌ను తొలగించే క్రమంలో గురువారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంగం పోలీసులు చొరవచూపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## ఇసుక డ్రెడ్జింగ్ పరిశీలన

**సంగం:** మండల కేంద్రమైన సంగం సమీపంలో పెన్నా నదిలో చేపడుతున్న ఇసుక డ్రెడ్జింగ్‌ను ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత గురువారం పరిశీలించారు. అనంతరం స్టాక్ పాయింట్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్నానదిలోని ఇసుకను డ్రెడ్జింగ్ విధానంలో తవ్వి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. యాప్ యాక్టివేట్ అయిన తరువాత అవసరమైన వారికి ఇసుకను అందించడం జరుగుతుందన్నారు. ఇసుక ధరను జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని, ఆ మేరకు డంపింగ్ యార్డు వద్ద రవాణా చార్జీలు, ఇసుక ధర కలిపి డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ సోమ్లానాయక్, సిబ్బంది ఉన్నారు.

## ఉచిత వైద్యశిబిరం



**మర్రిపాడు:** పడమటినాయుడుపల్లిలో 104 వాహన సిబ్బంది గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ షేక్ మస్కూర్ అహ్మద్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ హర్షిత, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశాలు మాధవి, రమాదేవి, అచ్చెమ్మ పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి



ఉదయగిరి: మాట్లాడుతున్న పద్మావతి

**చేజర్ల:** ప్రభుత్వ గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ మండల ప్రత్యేక అధికారి సాంబశివారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై మండలాధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1011 గృహాలు మంజూరవగా, కొన్ని బేస్‌మట్టం, మరికొన్ని శ్లాబ్‌లెవల్ వరకు నిర్మాణం చేపట్టి ఉన్నాయన్నారు. ప్రభుత్వ లేఅవుట్లలో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయన్నారు. మూడు నెలల్లో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మండలాధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలలిత, ఏపీఎం సుజన, హౌసింగ్ ఏఈ ప్రకాష్, ఉపాధి ఏపీఓ వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**ఉదయగిరి:** ప్రభుత్వం నిర్దేశించిన నూరుశాతం పక్కాగృహాల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ అతిథి గృహంలో మండలాధికారులతో పక్కాగృహ నిర్మాణాలపై గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి చివరి నాటికి పక్కాగృహ నిర్మాణాలు లబ్ధిదారులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు అందాల్సిన 90 రోజుల పనిదినాల నిధులను అందించాలన్నారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏపీఓ శ్రీనివాసులు, ఏపీఎం ఖాజారంతుల్లా, వర్క్ ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్, చెన్నారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



మాట్లాడుతున్న అధికారులు

**అల్లూరు:** అల్లూరు పడమర ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ, ఎస్వీఎన్నార్ సొసైటీలో మహాజన సభలను గురువారం నిర్వహించారు. సహకార విద్యాధికారి గోగుల శ్రీనివాసులు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తున్న నేపథ్యంలో సభ్యులుగా ఉన్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ స్వప్న, పర్సన్ ఇన్‌చార్జి రమేష్ బాబు, సొసైటీల సీఈఓలు ఏ రాధయ్య, ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**సీతారామపురం:** మారంరెడ్డిపల్లి సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి కోరారు. మారంరెడ్డిపల్లి సొసైటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక మహాజనసభలో ఆయన మాట్లాడారు. సొసైటీలో సొంత, కౌలు భూమి లేని రైతులతో పాటు గత కొన్నేళ్లుగా సంఘంలో ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించడం జరుగుతుందన్నారు. కంప్యూటరీకరణలో భాగంగా సభ్యులు పొలం బ్యాంకు పుస్తకాలు, ఆధార్‌కార్డు, ఫొటోలు, మొబైల్ నంబరును కార్యాలయంలో అందజేసి విధిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే సొసైటీలో సభ్యులుగా ఉండి చనిపోయిన వారి సభ్యత్వాలను రద్దు చేస్తున్నామని, వాయిదాలు మీరిన బకాయిదారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ సీఈఓ సంకతాల శ్రీనివాసులు, రైతులు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న గోపాల్

**ఆత్మకూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని ఏసీఎస్సార్ కాలనీ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్‌లను పరిశీలించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం హెచ్ఎం హజరత్ రెడ్డి, ఉపాధ్యాయులతో సమావేశమై సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ డాక్టర్లు పాఠశాలలకు వచ్చినప్పుడు అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం



**సోమశిల:** అనంతసాగరంలోని టీజేఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బత్రెడ్డి లక్ష్మీప్రసన్నను సహచర ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకోవడంపై అభినందనలు తెలిపారు. ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### హోంగార్డు మృతికి నివాళి



**సీతారామపురం :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్‌ఖాదర్ బుధవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని ఉదయగిరి సీఐ ఎస్ వెంకట్రావు గురువారం సందర్శించి నివాళులర్పించారు. హోంగార్డు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డిపార్ట్‌మెంట్ నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం పోలీసులు సమకూర్చిన కొంత నగదును అందజేశారు. ఆయన వెంట ఏఎస్సై వెంకటసుబ్బయ్య, పోలీసులు ఉన్నారు.

### పరామర్శ

**సోమశిల:** అనంతసాగరం మండల మాజీ ఎంపీపీ మునగపాటి సుబ్బరాజు కుటుంబాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల సుబ్బరాజు మృతి చెందిన నేపథ్యంలో చిలకలమర్రిలోని మునగపాటి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### అన్నప్రసాద వితరణ

**అనుమసముద్రంపేట:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజైన గురువారం ఏఎస్ పేటలోని బాలచౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత విశేష పూజలు నిర్వహించారు.

### రాధారమణ సేవలు మరువలేనివి



**ఉదయగిరి:** ఉదయగిరి మెట్టప్రాంతంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రముఖ పారిశ్రామికవేత్త బత్తుల రాధారమణ ఎంతో కృషిచేశారని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని గంగిరెడ్డిపల్లిలో గురువారం జరిగిన రాధారమణ ఉత్తరక్రియల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. రాధారమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పీ చెంచలబాబు, మన్నేటి వెంకటరెడ్డి, షేక్ రియాజ్, బయ్యన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన ర్యాలీ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

**కావలి:** అడ్వొకేట్ యాక్ట్– 1961ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వొకేట్ యాక్ట్ (సవరణ)–2023 బిల్లును వ్యతిరేకిస్తూ కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. కోర్టు విధులను బహిష్కరించి న్యాయవాదులు ట్రంకురోడ్డులో ర్యాలీ చేపట్టారు. న్యాయవాదుల హక్కులకు భంగం కలిగించే బిల్లును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వెంకటేశ్వర్లు, జయప్రకాశ్, అభిషేక్, శేషు ప్రసాద్, మల్లి, కామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాల వితరణ



**కావలి:** పట్టణంలోని వాసవీ క్లబ్ లెజెండ్స్, సెవన్ లైన్స్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, ఇతర మిత్రులు సహాయ సహకారాలతో విజయవాడ వరద బాధితులకు గురువారం నిత్యావసరాలను వితరణ చేశారు. బియ్యం, దుప్పట్లు, చీరలు, కందిపప్పు, పాల ప్యాకెట్లు, దుస్తులు, వాటర్ బాటిళ్లు, బ్రెడ్లు, తదితరాలను వితరణ చేసినట్లు పొదర్తి నాగరాజు, గాదంశెట్టి వేణుగోపాల్ తెలిపారు.

## రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

**కావలి:** పట్టణంలోని వెంగళరావునగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం హయ్యూల్ హయ్యూమ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఖచ్చితంగా వారి రక్త గ్రూపును తెలుసుకోవాలన్నారు. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అవసరమైన, ఇంకొకరికి రక్తదానం చేయాలన్నా తప్పనిసరిగా రక్త గ్రూపు తెలిసి ఉండాలన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్‌సీసీలోకి 60 మంది విద్యార్థులను తీసుకోవడం జరిగిందని, వాళ్లందరి రక్తగ్రూపును దరఖాస్తుల్లో నింపేందుకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ కావలి శాఖ సేవలు అమోఘమని, నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని కొనియాడారు. ఎస్ఎంసీ చైర్మన్ కల్లయ్య, రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు శానం హరి, జీవ శాస్త్ర అధ్యాపకులు ఆంజాద్‌అలీ, రెడ్ క్రాస్ సిబ్బంది సీహెచ్ వెంకటేశ్వర్లు, జే శేషమ్మ, ఐ అనిల్ పాల్గొన్నారు.

## పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సీతారామపురం: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ తేజస్విని



ఆత్మకూరులో ..

**ఆత్మకూరు:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత కోరారు. పట్టణంలోని సెక్టార్–1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో సీడీపీఓ పాల్గొన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీల ఆధ్వర్యంలో పోషకాహార నమూనాను ప్రదర్శించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, మెప్మా సీఓ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

**సీతారామపురం:** మండలంలోని నారాయణప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజరు తేజస్విని, వైద్యాధికారిణి భవ్యశ్రీ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పాలు, గుడ్లు, ఖర్జూరం, చిక్కీలు వంటివి తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య సిబ్బంది కృష్ణమ్మ, నాయక్, పాఠశాల హెచ్ఎం బాలకృష్ణారెడ్డి, అంగన్‌వాడీలు సంపూర్ణ, మమత, జానీ, చంద్రమ్మ, ఆదిలక్ష్మి, భవాని, మాధవి పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మృతిపై సంతాపం

**ఆత్మకూరు/సోమశిల:** సీపీఎం జాతీయ కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి మృతి చెందడంపై ఆ పార్టీ ఆత్మకూరు, అనంతసాగరం నాయకులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన భౌతికకాయాన్ని సైన్స్ ప్రయోగాల కోసం ఢిల్లీలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కు దానం చేయడం పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. నాయకులు డేవిడ్ రాజు, జీ లక్ష్మీపతి, షేక్ సందానీ, ఎం నాగేంద్ర, నాగయ్య, లక్కు ప్రసాద్, సలారుద్దీన్ , మంగళ పుల్లయ్య, అన్వర్‌బాషా, సుబ్బరాయుడు, పెంచలయ్య, తదితరులు ఉన్నారు.